

డ్రైయినేజీ ఇఇ కిషోర్ సస్పెన్షన్

కలెక్టర్ నాగరాణి ఉత్తర్వులు జారీ

పాలకోడేరు: డ్రైయినేజీ శాఖ భీమవరం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎంవివి.కిషోర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. విధుల పట్ల అలసత్వం వహించడమే కాకుండా తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకుగాను కిషోర్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ చదలవాడ నాగరాణి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొగల్తూరు శివారు గొస్తనీ డ్రెయిన్‌కు గండి పడటానికి డ్రెయినేజీ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పర్యవేక్షణలోపంతోపాటు వరద నేపథ్యంలో సరైన ముందస్తు చర్యలు తీసుకోకపోవడంపై ఈ చర్య తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో అత్యంత జాగ్రత్తగా, ప్రజలకు ఇబ్బంది కలగకుండా విధులు నిర్వర్తించాల్సిన అధికారి తీవ్ర అలసత్వం వహించడంతో డ్రెయిన్‌కు గండి పడి వందలాది ఎకరాలు ముంపునకు గురికావడంతోపాటు గుత్తులవారిపాలెం ఎస్‌టి కాలనీ ప్రజలు వరద దిగ్బంధంలో చిక్కుకున్నారని, దీనికి బాధ్యునిగా కిషోర్‌పై కలెక్టర్ చర్యలు తీసుకున్నారు.

'పోలవరం'పై పాతపాటే..!



- కేంద్ర బడ్జెట్‌పై జిల్లా ప్రజల్లో నిరాశ
- పోలవరం నిర్వాసితుల ఊసేలేని పరిస్థితి
- వ్యవసాయ రంగ అభివృద్ధికి అరకొర నిధులు
- రైల్వేలైన్లకు నిధులపై స్పష్టత కరువు
- వేతన జీవులకు దక్కని ఊరట

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు మొండిచెయ్యి మిగిలింది. కేంద్ర పరిధిలోని ఏఒక్క ప్రాజెక్టుకూ నిధుల కేటాయింపు సక్రమంగా లేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టుపై ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ పాతపాటే పాడారు. నిధుల కేటాయింపుపై స్పష్టత ఇవ్వకుండా పోలవరం పూర్తి బాధ్యత మాదే అంటూ మాటలతో సరిపుచ్చారు. ఈసారి ఎన్‌డిఎ ప్రభుత్వంలో టిడిపి కీలకంగా మారడంతో పోలవరం ప్రాజెక్టుకు బడ్జెట్‌లో భారీగా నిధుల కేటాయింపు ఉంటుందని అంతా భావించారు. పోలవరం నిర్వాసితులకు పునరావాస పరిహారం కింద దాదాపు రూ.33 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. తొలిఫేజ్‌లో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో దాదాపు 28 గ్రామాలను తరలించాలని నిర్ణయించారు. ఇప్పటి వరకూ తొలి ఫేజ్ నిర్వాసిత గ్రామాల్లో కూడా పునరావాస ప్యాకేజీ ఇవ్వడంగాని, ఇళ్ల నిర్మాణంగాని పూర్తి కాలేదు. నిర్వాసితులు ప్రతియేటా వరదలకు గ్రామాలు వదిలి నానాయాతన పడుతున్నారు. ఏడాదికి మూడు నెలల పాటు వరద బాధితులుగా అష్టకష్టాలు అనుభవిస్తున్నారు. పోలవరం నిర్వాసితుల గురించి కేంద్రమంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో ఒక్కమాటా మాట్లాడలేదు. దీంతో నిర్వాసిత పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్ రూ.48 లక్షల కోట్లుకాగా వ్యవసాయ, అనుబంధ రంగాలకు చేసిన కేటాయింపులు కేవలం రూ.లక్షా 52 వేల కోట్లు మాత్రమే. మూడు శాతం నిధులు కూడా వ్యవసాయానికి కేటాయించలేదు. ఎరువులు, పురుగుమందుల ధరలు పెరిగి వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయింది. బడ్జెట్‌లో కేటాయించిన నిధులు పిఎం కిసాన్‌కే అత్తెసరు సరిపోతాయి. మరి వ్యవసాయరంగ అభివృద్ధి ఏవిధంగా జరుగుతుందో మోడీ సర్కార్ చెప్పాల్సి ఉంది. వ్యవసాయానికి ఊతమిచ్చే బడ్జెట్ అంటూ చెబుతూ నిధుల కేటాయింపు మాత్రం అరకొరగా చేపట్టడం విశేషం. రైతులకు మద్దతు ధర అందించడంలోనూ అబద్ధాలు వల్లె వేశారు. 50 శాతం మద్దతు ధర అదేవిధంగా చేశామని చెప్పుకు రావడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నిత్యావసర వస్తువుల ధరల తగ్గింపుపై ఎటువంటి చర్యలూ లేకుండాపోయాయి. బంగారం వంటి వాటిపై మాత్రం దిగుమతి పన్నులు తగ్గించడం విశేషం. బడ్జెట్‌లో వాస్తవ సాగుదారులైన కౌలురైతుల ప్రస్తావన లేకుండా పోయింది.

రైల్వేలైన్ల నిధులపై స్పష్టత కరువు

నరసాపురం-కోటిపల్లి, కొవ్వూరు-భద్రాచలం రైల్వేలైన్లకు నిధుల కేటాయింపుపైనా స్పష్టత లేకుండాపోయింది. ఈ రైల్వేలైన్లు ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి కన్పించడం లేదు. విద్యారంగానికి లక్షన్నర కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ నిధులు ఏవిధంగానూ సరిపోవు. జిల్లాలో ఉన్న నిట్ రెండోవిడత అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది. నిధుల లేమితో ముందుకు సాగని పరిస్థితి ఉంది. కేంద్రీయ విద్యాసంస్థల అభివృద్ధి పడకేసింది. ఉపాధి హామీకి నిధులు పెంపులేదు. దీంతో వ్యవసాయ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడనున్నారు. వేతన జీవులకు ఆదాయపన్ను పరిమితి రూ.ఐదు లక్షలకు పెంపుచేస్తారని ఆశించినా అదీ జరగలేదు. దీంతో వేతన జీవులు తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. కేంద్ర బడ్జెట్ అంతా మాటల గారడీ అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆశ.. నిరాశల బడ్జెట్

బడాబాబులకే రాయితీలు..



సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం, భీమవరం

కాకుల్ని కొట్టి గెద్దలకు పెట్టినట్లుంది కేంద్ర బడ్జెట్. బడా కార్పొరేట్లకు, విదేశీ కార్పొరేట్లకు టాక్సుల రాయితీలిచ్చి వేల, లక్షల కోట్లు దోచి పెట్టారు. నిత్యావసర వస్తువుల ధరలు అదుపు చేసేందుకు చర్యలు తీసుకోవాలి. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించలేదు. ఎరువులు, పురుగు మందుల ధరల పెంపు అన్యాయం. గిట్టుబాటు ధరలు, ధరల స్థిరీకరణ నిధి, రైతు ఆత్మ హత్యల నివారించే చర్యలు లేవు. రైతు రుణ భారం తొలగింపు, రుణ మాఫీ లేదు. నిరుద్యోగ సమస్య అదుపునకు, ఉపాధి కల్పనకు, మూతబడిన పరిశ్రమలు తెరిచేందుకు చర్యలు శూన్యం. విశాఖ ఉక్కు అమ్మకం ఆపుతామని ప్రకటించలేదు. పోలవరానికి ఎన్ని నిధులు ఇస్తారో, ఎప్పుడు పూర్తి చేస్తారో చెప్పలేదు. ప్రత్యేక హోదా, రైల్వే జోన్, కడప స్టీల్ ప్లాంట్, విభజన హామీల అమలు ప్రస్తావన లేకపోవడం దారుణం.

ఈ బడ్జెట్ ఎపికి ఊపిరి పోసింది..



తోట సీతారామలక్ష్మి, టిడిపి పోలిట్ బ్యూరో రాష్ట్ర సభ్యురాలు, భీమవవరం టౌన్

కేంద్ర ఆర్థికశాఖా మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో రాష్ట్ర పునర్ నిర్మాణానికి, రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు, పోలవరం ప్రాజెక్ట్‌కు 200 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యంతో పూర్తి నిర్మాణపు ఖర్చును కేంద్రం భరిస్తుందని ప్రకటించడం హర్ష ణీయం. వైసిపి నిరంకుశ పాలనతో తిరోగమనంలో ఉన్న రాష్ట్రానికి ఊపిరి పోసిన ప్రధాని మోడీ, మంత్రి నిర్మలా సీతారామన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. రాష్ట్రంనీరు, విద్యుత్, రైల్వే, రోడ్లు ప్రాజెక్టులకు దశలవారీగా నిధుల కేటాయింపు, విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం, విభజన చట్టంలోని వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని అందిస్తామనడంపై హర్షణీయం.

నిరాశాజనకంగా బడ్జెట్



ఐ.రాజగోపాల్, ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి, తణుకు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఆశాజనకంగా లేదు. స్టాండర్డ్ డిడక్షన్ రూ.50 వేల నుంచి రూ.75 వరకూ పెంచారని, కనీసం రూ.1,50,000 వరకైనా పెంచాల్సింది. డిడక్షన్ ఆఫ్ ఫ్యామిలీ పెన్షన్ రూ.15 వేల నుండి రూ.25 వేల వరకూ పెంచారు. పాత విధానంలో పన్ను చెల్లించే వారికి ఈ స్లాబ్ రేటు ఉపయోగకరం కాదు. కొత్త విధానంలో కేవలం రూ.17,500 మాత్రమే పన్ను ఆదా అవుతుంది.

మంచి పరిణామం



మంతెన వెంకట రవివర్మ, రాష్ట్ర రైతు కార్యచరణ సమితి ఉపాధ్యక్షులు, కాళ్ల

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తామని ప్రకటించడం మంచి పరిణామం. ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో కీలక ముందడుగు పడింది. పోలవరం ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణానికి రూ.12 వేల కోట్ల ప్రతిపాదనలకు కేంద్రం అంగీకారం తెలిపింది. కేంద్ర కేబినెట్ ఆమోదంతో ప్రతిపాదనలకు కార్యరూపం దాల్చింది. పోలవరం జాతీయ ప్రాజెక్టు కాబట్టి, కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడం మంచి పరిణామం.

ఎర్రకాల్వ ముంపు రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎర్రకాల్వ ముంపునకు గురైన రైతులు, కౌలురైతులు, జిల్లా పరిషత్ భూములను సాగు చేసుకుంటున్న పేదలకు పంట నష్టపరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా నాయకులు చింతకాయల బాబూరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం జగన్నాథపురం సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సచివాలయ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా నాయకులు చింతకాయల బాబూరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ జగన్నాథపురం లోతట్టు ప్రాంతంలో ఉన్నటు వంటి రైతులు, కౌలురైతులు, జిల్లా పరిషత్ భూమి సాగు చేసుకుంటున్న రైతులు, పేదలు ఎర్రకాలువ ముంపునకు గురై తీవ్రంగా నష్టపోతున్నారని, వారికి తక్షణమే ప్రభుత్వం పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పంట నష్టపరిహారం, పెట్టుబడిసాయం కౌలు రైతులకే అందించాలని డిమాండ్ చేశారు. ఎర్రకాలువ ముంపునకు గురైన రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఉచితంగా ప్రభుత్వం అందజేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం గ్రామాధ్యక్షులు ఎం.విశ్వనాథం, కార్యదర్శి ముత్తా రాంబాబు, కమిటీ సభ్యులు పీలా గాదినాయుడు, కోనవరపు నాగభూషణం, గుడిగంటల శ్రీను, పీలా కోటేశ్వరరావు పాల్గొన్నారు.



గ్రామ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం జిల్లా నాయకులు చింతకాయల బాబూరావు

ఎంపిడిఒ అదృశ్యం విషాదాంతం

నరసాపురంలో విషాదఛాయలు

కాల్స్ గుట్టు తేల్చితే కీలకాంశాలు వెలుగులోకి !

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ఎంపిడిఒ అదృశ్యం విషాదాంతమైంది. ఎంపిడిఒ వెంకటరమణ మృతదేహం మంగళవారం విజయవాడ నగరంలోని మధురానగర్ వంతెన వద్ద ఏలూరు కాలువలో లభ్యమైంది. ఈ నెల 15న మచిలీపట్నంలో పని ఉందని వెళ్లిన ఆయన విగతజీవుడై రావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. నరసాపురంలోని గోదావరిపై ఫెర్రీ కాంట్రాక్టుదారుడు పాట సొమ్ము రూ.54 లక్షలు చెల్లించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ ఒత్తిడితో సూసైడ్ చేసుకుంటున్నట్లు అదేరోజు రాత్రి కుటుంబసభ్యులకు మెసేజీ పంపారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ ఎంపిడిఒ కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకోవడంతోపాటు అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఏలూరు కాలువలో దాదాపు 25 కిలోమీటర్ల మేర గత ఎనిమిది రోజుల నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో మధురానగర్ ప్రాంతంలో ఏలూరు కాలువలో వంతెన వద్ద మృతదేహాన్ని గుర్తించారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆగిన చోట నుండి సుమారు 500 మీటర్లు దూరంలోనే ఆయన మృతదేహం లభ్యం కావడంతో అంతటా విషాదం నెలకొంది. ఇన్ని రోజులుగా ఆయన జాడ తెలియకపోవడంతో ఆయన బతికే ఉండొచ్చని ప్రచారం సాగింది. ఫెర్రీ పాటదారుడు రెడ్డప్ప ధవేజీ బకాయిలు చెల్లించాలని అడిగితే బెదిరిస్తున్నారని, మాజీ ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు, తన ఉన్నతాధికారులు ఇబ్బందులు పెట్టారని, తనకు న్యాయం చేయండి అంటూ డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌కు సైతం ఎంపిడిఒ లేఖ రాశారు.

తన భర్తకు కొన్ని ఫోన్‌కాల్స్ వచ్చినప్పుడు తీవ్ర ఆందోళనకు గురయ్యేవారని ఆయన భార్య సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. అదే సమయంలో ఆయన కుమారుడు సైతం తన తండ్రి కొందరికి సొమ్ము పంపారని చెప్పడంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. ఆయన ఇంటి వద్ద నుంచి వెళ్లిపోయే కొన్ని రోజుల ముందు, వెళ్లే ముందు రోజు కూడా లక్షల్లోనే సొమ్ము కొన్ని నెంబర్లకు పంపినట్లు ప్రచారం సాగుతోంది. ఆ నెంబర్లు ఎవరివి, ఆయన ఆందోళనకు గురయ్యేలా ఫోన్ చేసి బెదిరించింది ఎవరనేది పోలీసులు గుర్తించగలిగితే ఎంపిడిఒ ఆత్మహత్య వెనుక మిస్టరీ వీడే అవకాశం ఉంది. ఆ దిశగా ప్రభుత్వం, అధికారులు విచారణ, దర్యాప్తు సాగించాలని అంతా కోరుతున్నారు.



ఎంపిడిఒ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

నివాళులర్పించిన ఎంఎల్ఎ

నరసాపురం ఎంపిడిఒ మండవ వెంకటరమణరావు మృతదేహానికి విజయవాడ కానూరులో నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ నివాళు లర్పించారు. తొలుత ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఎంపిడిఒ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కలచివేసింది: ఇన్‌ఛార్జి ఎంపిడిఒ

ఎంపిడిఒ వెంకటరమణ అదృశ్యం విషాదాంతం కావడం నరసాపురం వాసుల్ని కలచి వేసిందని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కె.వీరభద్రరావు అన్నారు. ఎంపిడిఒ మృతదేహం లభ్యమైందని తెలియగానే నరసాపురం మండల పరిషత్ కార్యాలయంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో సిబ్బంది, గ్రామ సచివాలయాల సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెంకటరమణ నరసాపురంలో పనిచేసింది కేవలం ఐదు నెలలేనని, వివాదరహితునిగా వ్యవహరించేవారని అన్నారు.

గోదావరి జోరు.. జనం బేజారు..!

- తగ్గని గోదావరి వరద ఉధృతి
- కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక
- పొంగిపొర్లుతున్న యనమదుర్రు, గోస్తనీ డ్రెయిన్లతోపాటు కాల్వలు
- జిల్లాలో రూ.146.76 కోట్లు నష్టం వాటిల్లినట్లు అంచనా
- 37,182 ఎకరాల్లో దెబ్బతిన్న నారుమళ్లు, నాట్లు, 154.46 హెక్టార్లలో ఉద్యాన పంటలు
- రూ.45.56 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదన



నరసాపురంలో ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

ప్రజాశక్తి - భీమవరం

భద్రాచలం వద్ద గోదావరి నిలకడగా ఉన్నా ధవళేశ్వరం బ్యారేజీ దిగువన వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. దిగువకు పెద్దఎత్తున నీరు విడుదల చేస్తుండటంతో వశిష్ట గోదావరితోపాటు యనమదుర్రు డ్రెయిన్, మురుగు, పంట కాలువలు పొంగిపొర్లుతున్నాయి. 1976 నుంచి 2023 వరకు ఐదుసార్లు భద్రాచలం వద్ద అత్యధిక నీటిమట్టం నమోదైంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతుండటంతో గోదావరి వరద ఉధృతి కొనసాగే ప్రమాదం ఉందని అంతా ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా కురిసిన వర్షాలు, వరదలకు రూ.146.76 కోట్లు మేర నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. 37,182 ఎకరాల్లో నారుమళ్లు, నాట్లు, 154.46 హెక్టార్లలో ఉద్యాన పంటలు ముంపుబారిన పడ్డాయి. సుమారు రూ.45.56 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ అవసరమని అధికార యంత్రాంగం అంచనా వేసింది. అయితే భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి మరింత పెరిగి మూడో ప్రమాద హెచ్చరిక జారీ అయితే తమ పరిస్థితి ఏమిటని గోదావరి పరివాహక ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు.

అల్పపీడనం ప్రభావంతో కురిసిన వర్షాలకు గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ప్రస్తుతం ధవళేశ్వరం, భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. భద్రాచలం వద్ద సోమవారం సాయంత్రం 49 అడుగులు నీటిమట్టం ఉండగా మంగళవారం ఉదయం 11 గంటలకు 51.40 అడుగులకు చేరింది. మధ్యాహ్నం ఒంటి గంటకు స్వల్పంగా తగ్గి 51.20 అడుగులకు చేరింది. సుమారు 13,24,981 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద ఉదయం ఏడు గంటలకు 14 అడుగులు నీటిమట్టం ఉండగా మధ్యాహ్నం 12 గంటలకు 14.40 అడుగులకు చేరింది. సుమారు 3,80,744 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని వశిష్టగోదావరి, యనమదుర్రు డ్రెయిన్, గోస్తనీ, మురుగు, పంట కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో జిల్లాకు వరద ముంపు కొనసాగుతుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే గోదావరిని ఆనుకుని ఉన్న ఆచంట, యలమంచిలి, నరసాపురం మండలాలు వరద తాకిడికి గురయ్యాయి. భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ అయితే 14,26,684 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉంది. ఇదే జరిగితే జిల్లాకు వరద తాకిడి మరింత పెరిగే ప్రమాదం ఉంది.

వర్షాల ధాటికి జిల్లాలో రూ.146.76 లక్షలు నష్టం

ఇప్పటికే జిల్లాలో నాలుగు రోజులు కురిసిన వర్షాలు, వరదల వల్ల 43 గ్రామాలు ముంపుబారిన పడ్డాయి. 20 మండలాల్లోని 37,182 ఎకరాల్లో వరి నారుమళ్లు, నాట్లు దెబ్బతిన్నాయి. సుమారు రూ.41.52 కోట్ల మేర నష్టం వాటిలింది. 614 మంది రైతులు సాగు చేస్తున్న 154.46 హెక్టార్లలో ఉద్యాన పంటలు ముంపు బారిన పడ్డాయి. సుమారు రూ.4.06 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అధికారుల అంచనా. 14 ఇళ్లు దెబ్బతినగా వాటిలో రెండు పూర్తిగాను, ఒకటి తీవ్రంగా దెబ్బతినగా, ఏడు ఇళ్లు పాక్షికంగా, నాలుగు గుడిసెలు దెబ్బతిన్నాయి. 179.820 కిలోమీటర్ల మేర 66 ఆర్అండ్‌బి రోడ్లు దెబ్బతిన్నాయి. వీటి తాత్కాలిక మరమ్మతులకు రూ12.88 కోట్లు, శాశ్వత మరమ్మతులకు రూ130 కోట్లు వ్యయమవుతుందని అంచనాలు రూపొందించారు. 274.27 కిలోమీటర్ల పరిధిలోని 105 పంచాయతీరాజ్ రోడ్లు దెబ్బతిన్నాయి. వీటి తాత్కాలిక మరమ్మతులకు రూ.కోటీ 30 లక్షలు, శాశ్వత రోడ్లు ఏర్పాటుకు రూ.85.70 కోట్లు వ్యయమవుతుందని అంచనాలు వేశారు. అలాగే వరి, ఉద్యాన పంటలకు రూ.45.56 కోట్లు పంట నష్టానికి ఇన్‌పుట్ సబ్సిడీ అవసరమని అంచనాలు రూపొందిస్తున్నారు.

బిక్కుబిక్కుమంటున్న లంక గ్రామాల ప్రజలు



నరసాపురం : బాపు ఘాట్ వద్ద గోదావరి ఉధృతి

ప్రజాశక్తి - ఆచంట

వశిష్ట గోదావరిలో మంగళవారం వరద ఉధృతి మరింత పెరిగింది. దీంతో లంక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి పెద్దఎత్తున వరద నీరు సముద్రంలోకి వదులుతుండటంతో వశిష్టగోదావరి రెండో ప్రమాద హెచ్చరికలో కొనసాగుతోంది. వశిష్ట ఉగ్రరూపంతో లంక గ్రామాల్లోకి వరద నీరు చేరుకుంది. పుచ్చల్లంక, అయోధ్యలంక పల్లపు ప్రాంతాలు, భీమలాపురం కాలనీలోకి మంగళవారం వరద నీరు చేరుకుంది. ఆయా లంకల్లో రహదారులు నీట మునిగాయి. పుచ్చల్లంక, భీమలాపురం ప్రధాన రహదారులు నీట మునిగాయి. ఇళ్ల చుట్టూ వరద నీరు చేరుకుంది. దీంతో ఆయా లంక గ్రామాల్లో నీట మునిగిన రహదారులపైనే జనం రాకపోకలు సాగిస్తున్నారు. పెదమల్లంలోని పర్యాటక కేంద్రం, మాచేనమ్మ ఆలయ ప్రాంగణం, కోడేరులోని అపరకర్మల భవనం చుట్టూ నీరు చేరింది. లంక గ్రామాల్లో తహశీల్దార్ ఐపి.శెట్టి, ఎంపిడిఒ నరసింహప్రసాద్, ఎస్ఐ రాజకుమార్ తన సిబ్బందితో పర్యటించారు. పల్లపు ప్రాంతాల్లోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు కోరారు.



చించినాడ వద్ద వరద ఉధృతి

నీట మునిగిన పంటలు

కూరగాయల పంటలు నీట మునిగాయి. సిక్లాస్ భూముల్లో రైతులు పెద్దఎత్తున కూరగాయలు పండిస్తున్నారు. నాలుగు రోజులుగా వరద పెరుగుతూ రావడంతో తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. తమలపాకు తోటలతోపాటు అరటి తోటలకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. ఏటిగట్టు దిగువన ఉన్న లంక గ్రామాల్లోని కొబ్బరి తోటల్లో అంతరపంటలు నీట మునిగాయి. పశువుల పాకల చుట్టూ నీరు చేరడంతో రైతులు పశువులను ఏటిగట్టుపైకి, సురక్షిత ప్రాంతాలకు తరలించారు. లంక గ్రామాల నుంచి పడవల ద్వారా కొబ్బరికాయలను కరుగోరుమిల్లి రేవుకు తరలించి ట్రాక్టర్‌పై సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

నిలిచిపోయిన రాకపోకలు

లంక గ్రామాలు వరద గుప్పెట్లో చిక్కుకోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. లంక గ్రామాల్లో పాముల బెడద ఎక్కువగా ఉందని జనం వాపోతున్నారు. వరద ఉధృతికి పెద్దఎత్తున పాములు లంకల్లోకి వస్తున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని బెంబేలెత్తిపోతున్నారు. వరద ఉధృతికి మండలంలోని పెదమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురం పుష్కర ఘాట్లు పూర్తిగా నీట మునిగాయి.

నరసాపురం: నరసాపురం వద్ద వశిష్ట గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. ఎగువ నుంచి దాదాపు 14 లక్షల క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడిచిపెట్టడంతో నరసాపురంలోని రేవుల్లో నీటి మట్టాలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఇప్పటికే వరద ఉధృతికి ఉభయగోదావరి జిల్లాల మధ్య పంట్లు, నాటు పడవల రాకపోకలను నిలిపివేసిన అధికారులు గోదావరి పరివాహక ప్రాంతంలోని స్లూయిస్ తలుపులను కూడా మూసి వేశారు. ఏటిగట్లు బలహీనంగా ఉన్న ప్రదేశాలను గుర్తించి ఇసుక బస్తాలతో పటిష్టం చేస్తున్నారు. దాదాపు పదివేల ఇసుక బస్తాలను సిద్ధం చేశారు. పొన్నపల్లి ప్రాంతంలో మురుగునీరు తోడేందుకు ఇప్పటికే మూడు విద్యుత్ మోటార్లు సిద్ధం చేశారు.

యలమంచిలి: యలమంచిలిలో వరద ఉగ్రరూపం దాల్చింది. దీంతో లంక గ్రామాలైన కనకాయలంక, పెద్దలంక, బాడవ, యలమంచిలి లంక, లక్ష్మీపాలెం దొడ్డిపట్ల, పల్లిపాలెం గ్రామాలకు మంగళవారం సాయంత్రాని ఇళ్ల వద్దకు వరద నీరు చేరింది.

లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పునరావాస కేంద్రాలకు తరలిరావాలి

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - ఆచంట

గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం మండలంలోని కోడేరు వద్ద గోదావరి ఉధృతిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, నాయకులు, అధికారులతో మాట్లాడారు. ప్రస్తుతం మనకు వర్షాలు లేకపోయినా ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరద పెరుగుతోందన్నారు. గోదావరి యథాస్థితికి వచ్చేవరకు లంక గ్రామాల్లో లోతట్టు గ్రామాల ప్రజలు పునరావాస కేంద్రాలకు, సురక్షిత ప్రాంతాలకు తరలి రావాలని కలెక్టర్ కోరారు. పునరావాస కేంద్రానికి వచ్చిన ఏఒక్కరూ ఇబ్బంది కలగకుండా వసతి ఏర్పాటుతోపాటు అల్పాహారం, టీ, భోజనం, వైద్య సహాయం అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. లంకవాసులు తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలిరావాలని కోరారు. గోదావరి వరద బుధవారం సాయంత్రం నాటికి తగ్గే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా, వైద్య సేవలు, శానిటేషన్‌పై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక బోట్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. లంకగ్రామాల్లో ముందస్తు చర్యలో భాగంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ సౌకర్యానికి అంతరాయం లేకుండా చూడాలన్నారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేకాధికారి బి.పిచ్చయ్య, తహశీల్దార్ ఐపి.శెట్టి, ఎంపిడిఒ పి.నరసింహప్రసాద్, ఇఒపిఆర్‌డి మూర్తిబాబు, ఎలక్ట్రికల్ ఎఇ నాగేశ్వరరావు, పశువైద్యాధికారి ఎల్.ఫణికుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

అధికారులు సమర్థవంతంగా పని చేయాలి: కలెక్టర్

గోదావరి వరద సహాయక చర్యల్లో అధికారులు సమర్థవంతంగా పని చేయాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. వశిష్టగోదావరి వరద ఉధృతిని పరిశీలించిన అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, పోలీస్, విద్యుత్, వైద్యఆరోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, అగ్నిమాపక, పశు సంవర్ధక, మత్స్య తదితర శాఖల అధికారులతో వరదల కారణంగా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదావరి వరద ఇంకా ఉధృతంగా కొనసాగుతున్న దృష్ట్యా అధికారులు అన్ని ముందస్తు చర్యలూ తీసుకోవాలన్నారు. లంక గ్రామాల ప్రజలకు భోజన వసతులు, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. పశువులకు ఇటువంటి ప్రాణనష్టం జరగకుండా, సురక్షిత ప్రాంతాలకు తరలించి కాపాడాలన్నారు. ఏటిగట్లు బలహీనంగా ఉన్నచోట ఇసుక బస్తాలు, సర్వేబాదులు, వెదురు తడికెలు తదితర సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గోదావరి ఏటిగట్టు పటిష్టతను నిరంతరం పరిశీలించుకోవాలని, బలహీనంగా ఉన్నచోట యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని కన్జర్వెన్సీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మంచి కండిషన్‌లో ఉన్న బోట్లు, గజఈతగాళ్లు, లైఫ్‌జాకెట్లు సిద్ధంగా ఉంచాలన్నారు. అవసరమైన చోట అన్ని మందులతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించాలన్నారు. ముఖ్యంగా పాముకాటు, కుక్కకాటు మందులు తప్పనిసరిగా ఉండాలన్నారు. శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి బ్లీచింగ్, క్లోరినేషన్ చేయాలని, అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలని పంచాయతీరాజ్, వైద్యఆరోగ్యశాఖ అధికారులను ఆమె ఆదేశించారు.



విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేస్తున్న నేతలు

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - కాళ్ల

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, పిల్లలు వాటిని ఉపయోగించుకుని మంచి పౌరులుగా ఎదగాలని టిడిపి అధికార ప్రతినిధి చెలువకొలను శ్రీనివాస్ అన్నారు. లక్ష్మీనరసింహపురం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు దాత వీరవల్లి రమేష్ ఆర్థిక సాయంతో విద్యాసామగ్రిని మంగళవారం అందజేశారు. వీరవల్లి రమేష్ తల్లిదండ్రులు వీరవల్లి భాస్కరరావు (బాబీ), వీరలక్ష్మి జ్ఞాపకార్థం పాఠశాలలోని బాలబాలికలకు నోట్ బుక్స్, కాపీ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. మాజీ సర్పంచి వీరవల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి అవసరమైన కృషి చేస్తున్నామన్నారు. దాత వీరవల్లి రమేష్ మాట్లాడుతూ గ్రామంలో బాలబాలికలు బాగా చదివి ఐఎఎస్, ఐపిఎస్ సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు జుత్తుగ శ్రీనివాస్, ఇర్రింకి బుజ్జి, మాజీ ఎంపిటిసి గుడాల శివన్నారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ పట్టాభిరామయ్య ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సిసి క్యాడెట్లకు ప్రశంసాపత్రాలు అందజేత

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఇటీవల జరిగిన రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల్లో పోలీసులతోపాటు ఎన్‌సిసి క్యాడెట్ల సేవలు అద్వితీయమని డిఎన్ఆర్ కళాశాల ఉపాధ్యక్షులు గోకరాజు పాండు రంగరాజు అన్నారు. సిప్ యాక్టివిటీస్ బ్రాండ్ అంబాసిడర్ ఆధ్వర్యంలో జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు అందించిన ప్రశంసా పత్రాలను కళాశాలలో ఎన్‌సిసి క్యాడెట్లకు సోమవారం అందజేశారు. గోకరాజు పాండు రంగరాజు మాట్లాడుతూ ఓటు నమోదు నుంచి కౌంటింగ్ వరకూ ఎన్‌సిసి క్యాడెట్లు సహాయ సహకారాలు అందించడం గొప్పవిషయమన్నారు. ప్రిన్సిపల్ జి.మోజెష్ మాట్లాడుతూ ఇటువంటి జాతీయ కార్యక్రమంలో ఎన్‌సిసి క్యాడెట్లు సేవలందించడం ఆదర్శనీయమైన కార్యక్రమమన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి డిఎన్ఆర్ ఎన్‌సిసి క్యాడెట్లు మూడు నెలలపాటు ఓటు నమోదు మొదలు కౌంటింగ్ వరకూ పోలీసు శాఖకు సహకరించారని, 26 మందికి ప్రశంసా పత్రాలను అందించామని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, పి.రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

వరద ఉధృతిని పరిశీలించిన తహశీల్దార్

ప్రజాశక్తి - పెనుగొండ

ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు వశిష్ట గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. తహశీల్దార్ రోహిణీదేవి మంగళవారం పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎగువన కురిసిన వర్షాలకు అంతకంతకూ గోదావరికి వరద పెరుగుతోందని, లంక గ్రామాల రైతులు ఎప్పటికప్పుడు పశువులను ఏటిగట్టుకు తరలించి వాటి మేత అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆమె వెంట ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు అధ్వానం..!

సర్పంచి సొంత నిధులతో మరమ్మతులు

ప్రజాశక్తి - కాళ్ల

కోమటిగుంట గ్రామంలోని బిటి రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు అధ్వానంగా మారడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో ఈ రోడ్డు గుండా టాక్టర్లపై నల్లమట్టి తరలించారు. మట్టి తరలింపులో రోడ్డుపై పడిపోవడంతో ఇటీవల వర్షాలు కురిసిన వర్షాలకు రోడ్డంతా బురదమయంగా మారింది. దీంతో గ్రామస్తులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఏటా వర్షాకాలంలో ఇదే పరిస్థితి ఉంటుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులు అవస్థలు పడుతూ పాఠశాలలకు వెళ్తున్నారని వాపోతున్నారు. అయితే కోమటిగుంట ప్రధాన రహదారి ఆర్అండ్‌బి రోడ్డుకు నిధుల కేటాయింపు లేక పోవడంతో ఆ గ్రామ సర్పంచి బోణం భాగ్యశ్రీ శివకుమార్ సొంతనిధులతో మరమ్మతు పనులు చేపట్టారు.



రోడ్డు మరమ్మతు పనులు చేపడుతున్న సర్పంచి

పాఠశాలకు వంట సామగ్రి అందజేత

ప్రజాశక్తి - మొగల్తూరు

పాఠశాల విద్యార్థులు భోజనం పథకానికి వీలుగా దాత సామగ్రిని అందించడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెనుమత్స రామరాజు అన్నారు. ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన కొల్లాటి నాగేశ్వరరావు ఆర్థిక సహాయంతో భోజన తయారీ గిన్నెలు, ట్రాలీని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతను పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కెఎస్ఎన్.రాజు, సామాజిక సేవా కార్యకర్త నాగిడి రాంబాబు, ఎంపిటిసి తిరుమల స్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులకు రుణమాఫీ ప్రకటించాలి

రైతు నాయకులు కూనపరెడ్డి రంగారావు

ప్రజాశక్తి - నరసాపురం

పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకుని, రుణమాఫీ ప్రకటించాలని వైఎస్.పాలెం గ్రామ మాజీ సర్పంచి, సర్పంచుల ఛాంబర్ మండల మాజీ అధ్యక్షుడు, రైతు నాయకులు కూనపరెడ్డి రంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంక్షేమమే తమ ధ్యేయమంటూ అధికారం చేపట్టిన తర్వాత రైతుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక, అమ్మిన పంటకు సకాలంలో డబ్బు చెల్లించకపోవడం, ఆకాశాన్నంటిన ఎరువుల ధరలతో పాటు వివిధ పెట్టుబడులతో రైతులు అన్ని విధాలా నష్టపోతున్నారన్నారు. ఆక్వా రైతులకు ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సహకాలు లేవని, ఇప్పటికే విద్యుత్ చార్జీలు పెంపుతో సతమతం అవుతున్న ఆక్వా రైతును అదనంగా డిపాజిట్ పేరుతో ఆక్వా రైతు లకు డిమాండ్ నోటీసులు పంపి బలవంతపు వసూళ్లు చేస్తున్నారన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలి

మొగల్తూరు: వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని మొగల్తూరు పిహెచ్‌సి వైద్యులు ఓ దినేష్ కుమార్ సూచించారు. మంగళవారం ఆయన పలు సూచనలు చేశారు. కలుషిత నీరు ద్వారా నీళ్ల విరోచనాలు, టైఫాయిడ్, కామెర్లు తదితర వ్యాధులు రాకుండా కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలన్నారు. సాధ్యమైనంత వరకూ వేడి ఆహారం తినాలన్నారు. దోమల ద్వారా వ్యాపించి మలేరియా, డెంగీ, చికెన్ గున్యా మొదలైనవి వ్యాపిస్తాయని, ముఖ్యంగా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు.

పలువురికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని హోమియోపిల్స్ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. పాలకొల్లులోని పోడూరు రాజుకు చెందిన హోమియోపిల్స్ ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పలువురిని పరీక్షించి వారికి పలు సూచనలు చేశారు. అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. ఈ శిబిరంలో ఎన్.సాయికుమార్, ఎస్.సతీష్ సేవలందించారు.

బకాయి వేతనాలివ్వాలని ఉపాధి కూలీల ధర్నా

ప్రజాశక్తి - తణుకు

ఉపాధి హామీ కూలీలకు బకాయి వేతనాలు తక్షణం విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, తహశీల్దార్ బి.ముక్కేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ రెక్కల కష్టం మీద ఆధారపడిన వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ చట్టం ఒక వరమన్నారు. ఈ చట్టం ద్వారా వ్యవసాయ కూలీలు ఉపాధి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతో చట్టంలో కొత్త కొత్త నిబంధనలు తీసుకొచ్చి సమ్మర్ అలవెన్స్ ఎత్తి వేసిందన్నారు. రెండు పూటలా పని, ఆన్‌లైన్ మస్తరు విధానం తీసుకొచ్చి కూలీలను ఇబ్బందులకు గురి చేస్తోందని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 6 నుండి 9 వారాల పాటు వేతనాలు చెల్లించకపోతే కూలీలు ఏవిధంగా బతుకుతారని ప్రశ్నించారు. కూలీలకు ఎక్కువ ఉపాధి పనులు చూపించేందుకు జంగిల్ క్లీనింగ్, తూడు, గుర్రపుడెక్క తొలగింపు, కచ్చా డ్రెయిన్ల పనులు ఉపాధి కూలీలతో చేయించేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని తెలిపారు. బడ్జెట్‌లో రెండు లక్షల కోట్లు నిధులు కేటాయించి ప్రతి కుటుంబానికీ 200 రోజుల పని కల్పించాన్నారు. ఈ కార్యక్రమంలో వాసా వెంకటేశ్వరరావు, పిండి సుబ్బారావు పాల్గొన్నారు.



తహశీల్దార్ ముక్కేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భీమవరం టౌన్

గత వేసవి కాలంలో చేసిన ఉపాధి పనుల బకాయిల కోసం వ్యవసాయ కార్మికులు ఎదురుచూస్తున్నారని సిఐటియు నాయకులు ఎం.ఆంజనేయులు, ఇంజేటి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో వారు పర్యటించి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బేతపూడి గ్రామంలో ఉపాధి కూలీలు వారి వద్ద గోడు వెళ్లబోసుకున్నారు. పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పనుల్లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని, కనీసం ఉపాధి బకాయిలు వస్తే రోజు గడుస్తుందని ఎదురుచూస్తున్నామని వాపోయారు. ప్రభుత్వాలు మారిన పేదల తలరాతలు మాత్రం మారడం లేదని ఆంజనేయులు, శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని ఉపాధి బకాయిలు విడుదల చేయాలని లేనిపక్షంలో పంచాయతీల వద్దే ఆందోళన చేపడతామని తెలిపారు.

పిల్లల సంరక్షణకు ప్రాధాన్యతివ్వాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

పిల్లల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యతివ్వాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చైల్డ్ వెల్ఫేర్ కమిటీని ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీతో సమావేశమై మిషన్ వాత్సల్య పథకంపై సమీక్షించారు. జిల్లాలోని బాలల సంరక్షణకు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ కృషి చేయాన్నారు. వీధి బాలలు, బడికి వెళ్లకుండా ఉన్న బాలలు, బాల కార్మికులుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారి బి.సుజాత రాణి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సెంట్రల్ కమిటీ డైరెక్టర్‌గా రాధా పుష్పావతి

తణుకు: తణుకు మండల డైరెక్టర్‌గా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కెరియర్ గైడెన్స్ కమిటీ ఛైర్మన్‌గా, రాష్ట్ర అభివృద్ధి, విస్తరణ కమిటీ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న రాధా పుష్పావతి ఉమ్మడి విశాఖపట్నం జిల్లా సెంట్రల్ కమిటీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మానవత వ్యవస్థాపకులు ఎన్.రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన నూతన బాధ్యతను సక్రమంగా నిర్వహించి సంస్థ అభివృద్ధికి పాటు పడతానని రాధా పుష్పావతి తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సెంట్రల్ కమిటీ ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, జిల్లా శాంతి ర్యాలీ కమిటీ ఛైర్మన్ గమిని రాంబాబు, పాయకరావుపేట ఛైర్మన్ బాలేపల్లి చినబాబు తదితరులు అభినందనలు తెలిపారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ఉండి

దివ్య డిగ్రీ కళాశాలలో ఈ నెల 26వ తేదీన నిర్వహించే జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల డైరెక్టర్ కె.దుర్గారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలైన అరబిందో ఫార్మసీ, అపోలో ఫార్మసీ, హ్యుందాయ్, ఇసుజు, ఇండిగో, ఐసిఐసిఐ బ్యాంక్, స్పందన తదితర కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. పది నుంచి ఆ పైన విద్యార్హత ఉన్న నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

సేవే లక్ష్యంగా లయన్స్ ముందుకు

ప్రజాశక్తి - ఉండి

సేవా సంకల్పంతో ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలని లయన్స్ క్లబ్ సభ్యుల సమావేశంలో పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక కూనపరాజు అప్పలరాజు సీతమ్మ లయన్స్ క్లబ్ ఆడిటోరియం వద్ద లయన్స్ క్లబ్ సభ్యుల సాధారణ సమావేశం మంగళవారం అధ్యక్షులు సత్తి బ్రహ్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సేవే లక్ష్యం నినాదంతో లయన్స్ క్లబ్ ఆవిష్కరించబడిందని, లేనివారికి చేయూతనందించి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని అధ్యక్ష కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు తెలిపారు. పరిపాలనాధికారి నరసరాజు మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమాలు, చైల్డ్ హుడ్ కేన్సర్, మధుమేహ వ్యాధులపై అవగాహన, మొక్కలు పెంపకం వంటి కార్యక్రమాలు నిర్వహించి సమాజానికి సేవలందించాలని ప్రణాళిక చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. సమావేశంలో కోశాధికారి పాలతీర్థపు నర్సింహారావు, నంబూరి కాశీ విశ్వేశ్వరరావు, కలిదిండి సీతారామరాజు, గాదిరాజు వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

చిన్నారితో అసభ్యకర ప్రవర్తన

యువకునిపై కేసు నమోదు

ఉండి: అభం శుభం ఎరుగని చిన్నారితో అసభ్యంగా ప్రవర్తించిన యువకునిపై కేసు నమోదైన సంఘటన ఉండి మండలం వాండ్రం గ్రామంలో చోటుచేసుకుంది. మంగళవారం ఉండి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. వాండ్రం గ్రామ శివారు రామాపురంలో మందా ఆశాజ్యోతి అనే మహిళ సోమవారం తన భర్తతో ఆసుపత్రికి వెళ్తూ తన ఏడేళ్ల చిన్నారిని ఇంటి పక్కన ఉంటున్న పాము బాలు అనే యువకుని వద్ద ఉంచి వెళ్లింది. బాలు ఆ చిన్నారితో అసభ్యంగా ప్రవర్తించగా చిన్నారి విషయాన్ని తల్లితో చెప్పడంతో తల్లి ఫిర్యాదు మేరకు ఉండి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'కార్యకర్తలు ధైర్యంగా ఉండండి'

ప్రజాశక్తి - ఆచంట

వైసిపి కార్యకర్తలంతా ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటానని మాజీ ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు భరోసా ఇచ్చారు. పోడూరు మండలం తూర్పుపాలెంలో పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద శ్రీరంగనాథ రాజు అధ్యక్షతన పోడూరు, ఆచంట మండలాల వైసిపి ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజవర్గంలో కార్యకర్తలకు తమ పూర్తి సహాయ సహకారాలు అందజేసి అండగా నిలుస్తానన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా ముందుకు సాగుదామన్నారు. టిడిపి కూటమి అధికారం చేపట్టిన 50 రోజుల్లోనే అన్ని రంగాల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పోడూరు జెడ్‌పిటిసి గుంటూరు పెద్దిరాజు, ఆచంట మండల సర్పంచులు సుంకర సీతారామ్, జక్కంశెట్టి చంటి, గణేశుల శేషవాణి సుబ్బారావు పాల్గొన్నారు.

భృతి ఇవ్వాలని మత్స్యకారుల నిరసన

మొగల్తూరు: చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు జీవన భృతి వెంటనే ఇవ్వాలని మత్స్య కార్మిక సంఘ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గొడుగు శ్రీను, జల్లి రామ్మోహన్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దిప్పలపల్లవపాలెం గ్రామంలో మత్స్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వి.శ్రీను, తిరుమాని ముకుందరావు, కొల్లటి బేబీ వెంకటలక్ష్మి, కొల్లటి మావుళ్లమ్మ పాల్గొన్నారు.

కాచిచల్లార్చిన నీరు తాగాలి : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - తణుకు

ప్రజలందరూ కాచి చల్లార్చిన నీరు తాగాలని, ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డి.మహేశ్వరరావు సూచించారు. మంగళవారం దువ్వ గ్రామంలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించి ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ ముంపు ప్రాంతాల ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఆరోగ్య సమస్యలు ఏర్పడితే వెంటనే వేల్పూరు పిహెచ్‌సికి గాని, ప్రభుత్వాసుపత్రికి గాని వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి అడ్డా సూర్యనారాయణమూర్తి, వేల్పూరు పిహెచ్‌సి వైద్యాధికారి కె.సాయిభవాని, ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

వీరవాసరం: పద్దెనిమిది సంవత్సరాలు నిండకుండా బాలికలకు వివాహాలు చేస్తే అటువంటి వారు గర్భం దాల్చితే తల్లీ బిడ్డలకు ప్రమాదమని ఐసిడిఎస్ భీమవరం సిడిపిఒ నాగరత్నం తెలిపారు. అటువంటి వివాహాలను అడ్డుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపైనా ఉందని తెలిపారు. మిషన్‌శక్తి కార్యక్రమంలో భాగంగా మంగళవారం మత్స్యపురి హైస్కూల్ వద్ద కిశోర బాలికలకు మిషన్ శక్తి ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహాలు చేస్తే గర్భసంచి పూర్తిస్థాయిలో ఏర్పడదని, పుట్టే బిడ్డ ఎదుగుదల కూడా పూర్తిస్థాయిలో ఉండదన్నారు. అనంతరం గుడ్, బ్యాడ్ టచ్‌ల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కనకమహాలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది కృష్ణవేణి, స్వరూప పాల్గొన్నారు.

తణుకు : బాల సంజీవని కిట్‌లోని రాగిపండి, అటుకులు, కర్జూరం, బెల్లం, చిక్కీ తప్పనిసరిగా గర్భిణి, బాలింతలు తినాలని తణుకు ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ కె.కృష్ణకుమారి అన్నారు. వేల్పూరులో వంద రోజుల స్పెషల్ అవెరెన్స్, ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ఆఫ్ మిషన్‌శక్తి స్కీం ప్రోగ్రాం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం వద్ద గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కృష్ణకుమారి మాట్లాడుతూ కిశోర బాలికలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాత వివాహం చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఆర్.లీలా నాగవేణి, ఆయా చిట్టమ్మ పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకూ నష్టపరిహారం చెల్లించండి : సిపిఎం

ప్రజాశక్తి - ఉండి

ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుని, ఎకరాకు పది వేల రూపాయల నష్టపరిహారాన్ని ప్రకటించాలని ప్రభుత్వాన్ని సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం పాందువ్వ గ్రామంలో సిపిఎం బృందం పర్యటించి ముంపునకు గురైన నారుమడులను, నాట్లు వేసిన పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన అధిక వర్షాలకు మండలంలోని నారుమడులు ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రతి ఎకరాకూ పదివేల రూపాయల నష్టపరిహారాన్ని చెల్లించి రైతులను ఆదుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అధికారుల ద్వారా నష్టపోయిన రైతుల వివరాలు సేకరించాలన్నారు. యుద్ధ ప్రాతిపదికన బొండాడ మేజర్ డ్రెయిన్, యండగండి మీడియం డ్రెయిన్, మైనర్ డ్రెయిన్‌లలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తోడు చెత్తాచెదారం ప్లాస్టిక్ వ్యర్థాలను వెంటనే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఆయన వెంట సిపిఎం మండల నాయకులు మాదాసి గోపి, మాదాసి రామయ్య, పి.సుబ్రహ్మణ్యం, రైతులు ఉన్నారు.

అత్తిలి : మండలంలో తిరుపతిపురం గ్రామంలో ఇటీవలే కురిసిన అకాల వర్షాల కారణంగా ముంపునకు గురైన పొలాలను, నివాస ప్రాంతాలను సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏటా వర్షాలు, వరదల కారణంగా తిరుపతిపురం రైతులు, కౌలు రైతులు నష్టపోయారని తెలిపారు. సార్వాలో ఆకుమడులు, విత్తనాలు, ఎరువుల పెట్టుబడి ప్రారంభంలోనే 7000 రూపాయల వరకూ ఉంటుందని, అధిక వర్షాల కారణంగా రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వాలు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ సభ్యుడు శ్రీనివాస్, గోపాల పరమేశు, చంద్రరావు, రాంబాబు పాల్గొన్నారు.

పేరు గొప్ప.. ఊరు దిబ్బ ..!

కళాశాలకు వెళ్లే దారేదీ - ప్రయివేటు కళాశాల విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

స్థానిక కొమరాడ రోడ్డులోని ఓ ప్రయివేటు జూనియర్ కళాశాల విద్యార్థుల భద్రతను యాజమాన్యం గాలికొదిలేసిందనే విమర్శలు విన్పిస్తున్నాయి. నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు కళాశాల ప్రాంగణంలో పెద్దఎత్తున వర్షపు నీరు చేరింది. దీంతో కళాశాలలోకి వెళ్లే అవకాశం లేదు. అయినా ఆ కళాశాల యాజమాన్యం నీటిని బయటికి తోడేందుకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. ఈ వర్షపు నీటిలో నుండే విద్యార్థులు తరగతులకు వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. దీంతో విద్యార్థులు అష్టకష్టాలు పడుతూ ఆ మురుగునీటిలో నుంచే తరగతులకు హాజరవుతున్నారు. దీంతో చర్మవ్యాధులు సోకే అవకాశం ఉందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. దీనికితోడు నీరు నిల్వ ఉండటం వల్ల దోమల ఉధృతి పెరిగిందని, టైఫాయిడ్, డెంగీ, మలేరియా వంటి జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా ఈ ప్రాంతంలో ప్రాణాంతకమైన విషసర్పాలు ఎక్కువగా తిరుగుతాయని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులకు ఏమైనా జరిగితే బాధ్యత ఎవరిదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇదే ప్రాంగణంలో ఆదిత్య జూనియర్ కళాశాలతోపాటు సాయి ఆదిత్య కళాశాల కూడా ఉంది. ఈ రెండింటిలోనూ సుమారు రెండు వేలమందికిపైగా విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు లేకపోగా వాటి నిర్వహణా అంతంతమాత్రమేనని తెలుస్తోంది. యాజమాన్యం ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి కళాశాలలో వసతులు మెరుగుపర్చి విద్యార్థులకు భద్రత కల్పించాలని పలువురు కోరుతున్నారు. అదే సమయంలో ఉన్నత విద్యాశాఖాధికారులు సైతం ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏదైనా ఘటన జరిగాక హడావుడి చేయడం కాకుండా నిరంతరం కళాశాలలపై పర్యవేక్షణ చేసి విద్యార్థులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఆ దిశగా తక్షణం చర్యలు చేపట్టాలని, కళాశాల ఆవరణలో నీటినితోడించి, వసతులు మెరుగుపర్చాలని పలువురు విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.



నీటితో నిండిన కళాశాల ఆవరణ

తేరుకుంటున్న వరిచేలు

ప్రజాశక్తి - ఆచంట

వరుణుడు కరుణించడంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. వారం రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు నియోజకవర్గంలో నక్కల తాడేరు, కొఠాలపర్రు, వల్లూరు డ్రెయిన్లు ఉధృతంగా ప్రవహించాయి. దీంతో వేలాది ఎకరాలు ముంపు బారిన పడ్డాయి. అయితే రెండు రోజుల నుంచి వరుణుడు కరుణించడంతో ఆయా డ్రెయిన్లు తగ్గుముఖం పట్టాయి. దీనికితోడు రైతులు స్వచ్ఛందంగా గుర్రపుడెక్క, తూడు తొలగించడంతో ముంపుబారిన చేలల్లోని మురుగు ఆయా డ్రెయిన్లలోకి లాగడంతో చేలు తేరుకుంటున్నాయి. ఆచంట, పెనుమంచిలి, వల్లూరు, శేషమ్మ చెరువు, తదితర గ్రామాల్లో మాత్రం ఇంకా చేలు ముంపులోనే ఉన్నాయని రైతులు వాపోతున్నారు. వర్షం తగ్గడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇదిలా ఉండగా ముంపు బారిన పడిన కాలనీలో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామ పంచాయతీలో కార్యదర్శులు పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నారు.

కాళ్ల : కాళ్లలో కె.లంక ఛానల్ గట్టు బలహీనంగా ఉండడంతో మంగళవారం గండి పడింది. వెంటనే రైతులు స్పందించి అతి కష్టంతో గండిని పుడ్చారు. కాళ్ల గ్రామంలోని పంట చేల్లోని నీరు రుద్రయ్యకోడు మురుగుకాలువలోకి వెళ్లాలి. ప్రస్తుతం కాలువ పూడుకుపోవడంతో నీరు వెళ్లని పరిస్థితి నెలకొంది. అయితే కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కాళ్లలో వేలాది ఎకరాలకు సాగునీరందించే కె.లంక ఛానల్ అభివృద్ధికి నోచుకోకపోవడం, గట్టు బలహీనపడడంతో రైతులకు అగచాట్లు తప్పడం లేదు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాలువల నిర్వహణపై నిర్లక్ష్యం వహించడంతో ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందని పరిస్థితి మొన్నటి వరకూ నెలకొంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎగువ నుంచి వర్షపు నీరు కె.లంక ఛానల్‌లోకి ఉధృతంగా వస్తోంది. పంట కాలువ గట్లు బలహీనంగా ఉన్నాయి. కాలువలో పూడిక పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వ్యవసాయం, విద్యకు తగిన ప్రాధాన్యత లేదు : సిపిఐ

ప్రజాశక్తి - ఉండి

కేంద్ర బడ్జెట్లో వ్యవసాయం, విద్య వంటి ప్రాధాన్యత రంగాలకు కేవలం మూడు శాతం నిధులే కేటాయించడం దురదృష్టకరమని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో భీమారావు మాట్లాడారు. రైతుల ఆత్మహత్యల నివారణకు స్వామినాథన్ కమీషన్ సిఫార్సులు అమలు ఊసే లేదన్నారు. పంటలకు కనీస మద్దతు ధరకు నిర్దిష్టమైన హామీ లేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ, వ్యవసాయ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. ప్రత్యేకహోదా, విభజన హామీలు పూర్తి అమలుకు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి నిర్దిష్టమైన హామీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా సమితి సభ్యులు సనపల శ్రీనివాస్, కోన గొల్లయ్య పాల్గొన్నారు.

'వైసిపి దౌర్జన్యాలను అరికట్టాలి'

పెనుమంట్ర : రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం వచ్చి 41 రోజులైందని, సిఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, ఓర్వలేక జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో అలజడి సృష్టించే చర్యలకు దిగారని టిడిపి నరసాపురం పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షులు అనుమాలశెట్టి రాంబాబు అన్నారు. మంగళవారం మార్టేరులో ఆయన విలేకరులతో వైసిపి వారే దాడులు చేసుకుంటూ, హత్యలు చేసుకుంటూ అలజడి సృష్టించి టిడిపిపై బురద జల్లాలని చూస్తున్నారని విమర్శించారు. నరసాపురం పార్లమెంటరీ దేవాంగ సాధికారిక సమితి కన్వీనర్ భాస్కరరావు మాట్లాడారు.

వర్షాలతో రైతులకు నష్టం : ఎంఎల్ఎ

తణుకు: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా గ్రామాల్లోని పలు ప్రాంతాలు, పంట పొలాలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని తణుకు నియోజకవర్గ ప్రజల సమస్యల గురించి అసెంబ్లీ సమావేశాల్లో తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ రాష్ట్ర మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయ్యేరు యనమదుర్రు డ్రెయిన్‌లో అప్ స్ట్రీంలో ఉన్నటువంటి నందమూరు అక్విడెట్‌ను డిమాలిష్ చేసిన తర్వాత డ్రెయిన్ ద్వారా వర్షాకాలంలో వరద నీరు రావడంతో తణుకు నియోజకవర్గం తణుకు మండలం కోనాల, ముద్దాపురం, దువ్వ గ్రామాల్లో, అత్తిలి మండలం వరిఘేడు, తిరపతిపురం గ్రామాల మీదుగా వెళుతున్నటువంటి డ్రెన్ కు సంబంధించిన గేట్లు పూర్తిగా పాడైపోయాయని, దాని కారణంగా పలు ప్రాంతాలు, పంట పొలాలు నీట మునిగి రైతులు నష్టపోతున్నారని ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని సంబంధిత మంత్రులకు వివరించారు.